క్లుప్తంగా

మొబైల్ మెడికల్ ల్యాబ్ ప్రారంభం



మొబైల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక: అదాని గంగవరం పోర్టు ఏర్పాటు చేసిన సమగ్ర ఆరోగ్య సంరక్షణ పరీక్షా వాహనం (మొబైల్ మెడికల్ ల్యాబ్)ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాతగాజువాకలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉరుకులు, పరుగులతో గడుస్తున్న జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపడానికి అవకాశం లేకుండా పోతోందన్నారు. అనారోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి అవసరమైన మందులు వాడడం ద్వారా వాటిని నివారించుకోవచ్చన్నారు. వాహనంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా నిష్ణాతులైన వైద్యులు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో పోర్టు ప్రతినిధులు కె.ఎస్.ఎస్.బాపూజీ, రమేష్, కార్పొరేటర్ బొండా జగన్, నాయకులు నాగేశ్వరరావు, డేవిడ్, పుచ్చా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు కిరణ్‌చంద్ర ఎంపిక



అగనంపూడి: ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు 85వ వార్డు అగనంపూడి సమీపంలోని ఏబీఎస్ పాఠశాల విద్యార్థి కిరణ్‌చంద్ర ఎంపికైనట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజా దీపక్ తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు అమలాపురంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో కిరణ్ పాల్గొనున్నట్టు ఆమె పేర్కొన్నారు. పాఠశాలలో సోమవారం కిరణ్‌చంద్రను పాఠశాల వ్యవస్థాపకుడు పీ.ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజా దీపక్, పీడీ ఈశ్వరరావు, ఇతర సిబ్బంది అభినందించారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు



కుటుంబ సభ్యులతో వృద్ధురాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీసులు నగరంలోని వృద్ధాశ్రమంలో చేర్పించిన మహిళ ఆమె కుటుంబ సభ్యుల వద్దకు చేరుకుంది. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఒంటరిగా తిరుగుతున్న వృద్ధురాలిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు నగరంలోని వృద్ధాశ్రమంలో చేర్పించారు. శ్రీహరిపురం ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీకు చెందిన ఈ మహిళ కుమార్తె, అల్లుడి వద్ద ఉంటున్నారు శనివారం ఉదయం 10.30 ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వచ్చి ఉక్కునగరానికి చేరుకుంది. దీంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతకడం ప్రారంభించారు. ఆమె ఉక్కునగరంలో ఉందన్న సమాచారంతో కుటుంబ సభ్యులు సోమవారం స్టీల్‌ప్లాంట్ పోలీసులను సంప్రదించారు. దీంతో ఆమెను వృద్ధాశ్రమం నుంచి ఇంటికి తీసుకు వెళ్లినట్టు సీఐ కేశవరావు తెలిపారు.

వీధి కుక్కల ఏరివేత



కుక్కలను పట్టుకుంటున్న ప్రజారోగ్యశాఖ సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీకి చెందిన చిన్నారి యక్షితపై వీధి కుక్కలు దాడి చేయడంతో జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ సిబ్బంది స్పందించారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న శునకాలను సోమవారం పట్టుకుని తరలించారు. కాగా చిన్నారి యక్షిత కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది.



నా పేరు పి. ఆకాష్. నేను అనకాపల్లి నుంచి వచ్చి నడుపూరు ఉన్నత పాఠశాలో 10వ తరగతి చదువుతున్నాను. మా పాఠశాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఇంటికి చేరేసరికి రాత్రి 8 గంటలు అవుతుంది. పాఠశాలకు రావాలంటే ఉదయం 7గంటలకే బయలు దేరాలి. దీంతో చదువుకునే సమయం ప్రయాణం లోనే పోతుంది.

సమయం పెంపుపై గరం గరం!

- దూరప్రాంత విద్యార్థులకు ఇబ్బందులు
- విద్యార్థినుల భద్రత, రవాణా ప్రశ్నార్థకం
- విద్యార్థులపై ఒత్తిడి సరికాదంటున్న నిపుణులు

పెదగంట్యాడ: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పని వేళలను పెంచేందుకు చర్యలు చేపట్టింది. రోజుకు ఎనిమిది గంటలు పనిచేయాలని నిర్ణయించింది.దాని ప్రకారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉపాధ్యాయుల, విద్యార్థులు పాఠశాలల్లో ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ఈ నిర్ణయంపై ఉపాధ్యాయ వర్గాలతో పాటు దూర ప్రాంతాల విద్యార్థుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రవాణా సౌకర్యం లేక రోజంతా వృథా అవుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం పునరాలోచించి పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

మండలానికో పాఠశాల ఎంపిక

గాజువాక నియోజకవర్గంలో మండలానికి ఒక పాఠశాల (పైలట్)ను ఎంపిక చేసి కొత్త పనివేళలు అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 8 పీరియడ్స్‌లో పాఠశాల కాల నిర్ణయ పట్టిక ఉంది. తాజాగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెంచింది. అదనపు గంటను పాఠశాల మొదటి పీరియడ్, స్వల్ప విరామాలు, భోజన విరామ సమయాలకు కేటాయించారు. వీటిలో గాజువాక మండలంలో అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదగంట్యాడ మండలానికి సంబంధించి నడుపూరు ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల ఉపాధ్యాయులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల తర్వాత షేసియల్ అటెండెన్స్ వేయాల్సి ఉంది..

భద్రత, రవాణా ప్రశ్నార్థకం!

అదనపు గంటతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విదార్థినుల భద్రత, రవాణా సౌకర్యాలపై ప్రభావం చూపుతుందని ఉపాధ్యాయ వర్గాలు ఆందోళన చెందుతున్నారు. బస్, ఆటో సౌకర్యాల సమస్యలు వస్తాయని చెబుతున్నారు.



నడుపూరు పాఠశాలలో విద్యార్థులు

ఉపాధ్యాయుల ఆందోళన

ఉదయం 9 గంటలకే పాఠశాలకు చేరుకోవాలంటే దూరాన్ని బట్టి ఉదయం 7.30 నుంచి 8 గంటలకే బయలుదేరాలి. సాయంత్రం 5 గంటల వరకు బడిలోనే ఉంటే ఇంటికి చేరుకునే సరికి రాత్రి అవుతుందని..ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులకు ఇది చాలా ఇబ్బంది పెట్టే విషయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

లాభం కంటే.. నష్టమే ఎక్కువ

పాఠశాలల పని వేళలను సాయంత్రం గంట పెంచడం వల్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు లాభం కంటే నష్టమే ఎక్కువ కనిపిస్తోందని పలువురు వ్యాఖ్యానిసున్నారు. విద్యార్థులను 8 గంటల సేపు పాఠశాలలో కూర్చోబెట్టడం సరైనది కాదని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

పైలెట్ ప్రాజెక్ట్ రద్దు చేయాలి



ప్రభుత్వం ఉపాధ్యాయుల అభిప్రాయాలు తీసుకోకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరికాదు.వెంటనే ఈ నిర్ణయాన్ని నిలుపుదల చేయాలి. పాఠశాలల పనివేళలు పెంచడం వల్ల విద్యార్థులు ఎక్కువ సమయం తరగతి గదిలో ఉంటూ మానసిక ఒత్తిడికి గురవుతారు. దూర ప్రాంతాల విద్యార్థినులకు రాత్రి సమయంలో ప్రయాణం ఇబ్బందికరమే. కొఠారి కమిషన్ సూచన మేరకు పాత విధానాన్నే కొనసాగించాలి.విద్యా వ్యవస్థలో ప్రయోగాలు చేయవద్దు.

–ఎస్‌వీ ప్రభాకర్, పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి,

విద్యార్థులకు అవస్థలు



పాఠశాల పనివేళ పెంపు వల్ల అన్ని ప్రాంతాల విద్యార్థులకు ఇబ్బందులు ఎక్కువవుతాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు భద్రత కొరవడుతుంది. ఒక్కో పీరియడ్‌కు కేవలం 5 నిమిషాల సమయం పెంచడం ద్వారా ఎటువంటి ఉపయోగం ఉండదు. పనివేళల పెంపు నిర్ణయాన్ని దయచేసి విరమించుకోవాలి.

– కె శ్రీదేవి., విద్యార్థి తల్లి.పెదగంట్యాడ

బాలికల భద్రతను దృష్టిలో పెట్టుకోవాలి



నేను గంగవరం నుంచి వచ్చి నడుపూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. సాయంత్రం 5 గంటల వరకు పాఠశాల నిర్వహిస్తే ఎలా?. సీతాకాలం కావడంతో 5.30 గంటలకు చీకటి పడుతుంది. ప్రభుత్వం బాలికల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలి.

–వై.అనిత, 10వ తరగతి, నడుపూరు ఉన్నత పాఠశాల, గంగవరం

ఉద్యోగులకు జీతాలు వెంటనే చెల్లించాలి



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌తో చర్చిస్తున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని కార్మిక నాయకులు యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల నాయకులు సోమవారం డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్‌ను కలిసి జీతాలపై చర్చించారు. అక్టోబర్ నెలకు సంబంధించి 50 శాతం, నవంబర్ నెలకు సంబంధించి 65 శాతం వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఇంత మొత్తంలో జీతం పెండింగ్ ఉండడం వల్ల ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని... వెంటనే జీతం చెల్లించడానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డైరెక్టర్ మాట్లాడుతూ సీఎండీ, పర్సనల్ డైరెక్టర్ ఢిల్లీలో ఉన్నారని వారు వచ్చిన తర్వాత జీతాలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో కార్మిక నాయకులు జె. అయోధ్యరామ్, యు.రామస్వామి, జె. రామకృష్ణ, కె. రమణ పాల్గొన్నారు.

పీఏసీఎస్ సభ్యులు నామినీ పేర్లతో హాజరుకావాలి

అగనంపూడి: లంకెలపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సభ్యులు వారి నామినీ పేర్లు, ఆధార్ కార్డుతో అగనంపూడి సీడబ్ల్యూసీకి హాజరు కావాలని లంకెలపాలెం పీఏసీఎస్ కార్యదర్శి పి.సత్యనారాయణ కోరారు. అగనంపూడి ప్రాంతానికి చెందిన పీఏసీఎస్ సభ్యులు వారి నామినీ పేరు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో ఉదయం 9గంటలకు అగనంపూడి సీడబ్ల్యూసీకి హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. అలాగే కొత్త సభ్యులుగా చేరదలచిన రైతులు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఎక్కడైనా 20 సెంట్లు, అంతకంటే ఎక్కువ భూమి వారి పేరుతో ఉండాలని తెలిపారు. ఆ వ్యక్తి పేరుతో ఉన్న పాస్ పుస్తకం, నాలుగు ఫొటోలు, పాన్‌కార్డు, రూ.360 సభ్యత్వ రుసుం తీసుకు రావాలని ఆయన కోరారు.

హైందవ శంఖారావం కరపత్రం ఆవిష్కరణ



హైందవ శంఖారావం కరపత్రం ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకుడు మహేష్‌రెడ్డి తదితరులు

అగనంపూడి: వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారవం కరపత్రాన్ని సోమవారం అగనంపూడి సీడబ్ల్యూసీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి ఎ.మహేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో హిందువుల దేవాలయాలను హిందువులు నిర్వహించుకొనే అవకాశం లేకుండా, ప్రభుత్వ నియంత్రణలో కొనసాగిస్తుండడం దారుణమన్నారు. అన్ని మతాలకు వారి మతాలకు చెందిన సంస్థలు నిర్వహిస్తుంటే హిందూ దేవాలయాలపై ప్రభుత్వం పెత్తనం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని కోరుతూ వచ్చే ఏడాది జనవరి 5న నిర్వహించనున్న శంఖారావం సభకు పెద్ద ఎత్తున హిందువులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, జె.రమణ, ఎల్వీరమణ, కె.అప్పారావు, కె.తాతారావు, ఎ.సత్యనారాయణ, బి.అప్పారావు, ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ట్రావెల్ దుకాణం దగ్ధం



ఆహుతైన విద్యుత్ ఉపకరణాలు

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్ కూడలిలో ఒక ట్రావెల్ ఏజెన్సీ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ సంభవించి ఉపకరణాలు దగ్ధమయ్యాయి. వివరాలు... దువ్వాడ సమీపంలోని మంగళపాలేనికి చెందిన చంద్రశేఖర్ కొన్నేళ్లుగా రాజీవ్ నగర్ కూడలిలో వీరాంజనేయ టూర్స్ అండ్ ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్నారు. సోమవారం మధ్యాహ్న భోజనం కోసం దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. రెండు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి దుకాణంలో మంటలు వ్యాపించాయి. దీంతో ల్యాప్‌టాప్, కంప్యూటర్, ప్రింటర్, జెరాక్స్‌మిషన్‌తో పాటు ఇతర ఫర్నిచర్ దగ్ధమయ్యాయి. ప్రమాదం విషయాన్ని పక్కనున్న దుకాణ యజమానులు చంద్రశేఖర్‌కు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక శకటాలు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకురావడంతో పక్కనున్న దుకాణాలకు వ్యాపించలేదు. ప్రమాదంలో రూ.5 లక్షల ఆస్తినష్టం సంభవించిందని యజమాని చంద్రశేఖర్ తెలిపారు.

అదే కథ.. తప్పని వ్యథ!



వుడాకాలనీ ప్రధాన రహదారిలో పందుల స్వైర విహారం



సీతానగరంలో రోడ్డుపై పందులు

- మళ్లీ పందుల స్వైర విహారం
- హడలిపోతున్న జనం

పెదగంట్యాడ: మండలంలో పందులు మళ్లీ స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. అటుగా రాకపోకలు సాగించే వారిపై దాడులకు దిగుతున్నాయి. వాహనచోదకులకు అడ్డంగా రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని సీతానగరం, వుడాకాలనీ, పెదకోరాడ, చిన కోరాడ, సిద్ధేశ్వరం, దల్లివానిపాలెం, చిననడుపూరు, పెదనడుపూరు, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, రామచంద్రనగర్, గాంధీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, స్వతంత్రనగర్, బాలచెరువు, దిబ్బపాలెం, గొడ్డువానిపాలెం తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఎక్కడ చెత్తాచెదారం కనిపిస్తే అక్కడ తిష్టవేస్తున్నాయి. ఆ చెత్తా చెదారాన్ని చిందరవందర చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పెద్ద పెద్ద అరుపులు అరుస్తూ రోడ్ల పైకి వచ్చే వాళ్లని భయపెడుతున్నాయి. ఇప్పటికైనా అధికారుల చర్యలు తీసుకుని పందులను అరికట్టాలని కోరుతున్నారు.

హరహర మహాదేవ



అప్పికొండ సోమేశ్వరస్వామి



కోలాట బృందాన్ని సత్కరిస్తున్న ఆలయ కమిటీ



ఉక్కు బీసీ గేటు శివాలయంలో..



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



స్టీల్‌ప్లాంట్ పాత శివాలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



మహా శివునికి పూజలు చేస్తున్న భక్తులు



అన్న సమారాధన ప్రారంభిస్తున్న కోమటి శ్రీనివాసరావు



ఉక్కు బీసీ గేటు శివాలయంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



వాసవీ పంచయాతన దేవాలయంలో భక్తుల సందడి

అగనంపూడి: కార్తీక మాసం నాలుగో సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే ఆలయాల ఎదుట క్యూ కట్టారు. హర నామస్మరణలో తరించారు. ధ్వజ స్తంభాల వద్ద భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు.

- 87వ వార్డు కణితి పాత ఊరులోని శివాలయంలో అభిషేకాలు, భజనలు, కోలాట ప్రదర్శన గావించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు, నాయకలు కాంద్రేగుల అప్పలనాయుడు, బొడ్డేటి మోదినాయుడు, కోమటి రమాదేవి, గంధవరపు మురళీ, నర్రా రామారావు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 79వ వార్డు జూబిలీహిల్స్ కాలనీలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివునికి రుద్రాభిషేకం, విశేష పూజలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయులు సారథ్యంలో పూజలు నిర్వహించారు. వినుకోటి సాయిరామ్ భక్తుడు ఆలయానికి హుండీని బహూకరించారు.

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ శివాలయాల్లో కార్తీక పూజలు వైభవంగా జరిగాయి. టౌన్‌షిప్, బీసీ గేటు, కణితి కాలనీ శివాలయాల్లో భక్తులు దర్శనానికి పోటెత్తారు. ఆలయాల్లో శివ పార్వతులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. బీసీ గేటు శివాలయంలో మధ్యాహ్నం జరిగిన భారీ అన్న సమారాధనలో సుమారు 10 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్, ధర్మాల కనకరెడ్డి, సురేంద్ర, శ్రీరామ్మూర్తి, నడుపూరి శ్రీనివాస్, కాళిదాస్, రమేష్, నాగభూషణం తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- రవిరేస్ బంక్ సమీప కణితి పాత శివాలయంలో వేకువజాము నుంచి భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో 87వ వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద, నాయకులు బొడ్డ సన్యాసిరావు, ఎస్. సీతారామరాజు, అప్పలనాయుడు, ఎన్. రామారావు, చంద్రశేఖర్, దానప్పలు, ప్రగడ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులు కూచిపూడి నృత్యంతో భక్తులను ఆకట్టుకున్నారు.

- 76వ వార్డులోని బాల చెరువు ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు, హోమాలు, రుద్రాభిషేకాలు చేశారు.
- హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ పంచాయతన ఆలయంలో పరమేశ్వరునికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు.
- వుడాకాలనీ శివాలయంలో పార్వతీపరమేశ్వరులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.



అప్పికొండలో కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

సజ్జాస్ విష్ణు టెక్ నూతన శాఖ ప్రారంభం



పరిశ్రమను ప్రారంభిస్తున్న మేనేజింగ్ పార్టనర్ పాండురంగ ప్రసాద్

అక్కిరెడ్డిపాలెం: లూగాంగ్ ఇండియా ఏపీ డీలర్ సజ్జాస్ విష్ణు టెక్ మెషీనరీ పరిశ్రమను ఆటోనగర్ బి – బ్లాక్‌లో సోమవారం లూగాంగ్ మేనేజింగ్ పార్టనర్ సజ్జా పాండురంగ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడ, కడపలో ఈ ఫెసిలిటీలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో లూగాంగ్ ఇండియా ఎండీ భూసాంగ్, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ విక్రస్ మలహోత్రా, ఆటోనగర్ ఏపీఐఐసీ ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధానకార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా కోశాధికారి పర్వారి ప్రభాకర్, మాజీ ప్రతినిధులు శేషగిరి రావు, వై.సాంబశివరావు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న రామలింగేశ్వర శివాలయం

గాజువాక: జింక్ వద్ద రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర శివాలయంలో భక్తులు విశేష పూజలు చేశారు. వినాయకనగర్ వుడాకాలనీ కాశీ విశాలాక్షి విశ్వేశ్వర సహిత పంచాయతన ఆలయంతో పాటు కణితి రోడ్‌లోని ఏకాంబరాలయం, చట్టివానిపాలెం, చిట్టినాయుడుకాలనీ ఈశ్వరాలయం, అయ్యప్పస్వామి ఆలయాలు, దుర్గవానిపాలెం, గాజువాక గౌరీపరమేశ్వరుల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దుర్గానగర్‌లో శ్రీదుర్గా గణపతి సమేత మహాజ్ఞాన సరస్వతి దేవాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.